# అడవి పిల్ల



వఝ్ఝల కాళిదాసు, (ఆం. గీ. సా. ప.)

---

ఆ వూరు చుట్టుప్రక్కల వున్న అడవి పల్లెల కన్నింటికీ ఓరకం ముఖ్యపట్టణం లాంటిది. అక్కడ వారం వారం పెద్ద సంత జరుగుతూ వుంటుంది. కేవలం ఆసంత రోజున మాత్రం ఎక్కడలేని జనప్రవాహం అక్కడ సాగుతూ కన్నుల పండువుగా కనబడుతుంది. కాని ఆ వూరు ఎవళ్ళు వెళ్ళినా ఆ సంతరోజు ఉదయం వచ్చి సాయంత్రం ఎవరివూరు దారి వాళ్ళు పడతారు. అందుకు ముఖ్యమైన కారణం ఆవూరి నీరు. ఆ నీరు త్రాగినవాడు కొండ వుష్ణానికి దాసుడై తీరుతాడు.

రమణరావు తత్వానికి మాత్రం ఆ వూరు నీరు ఏమీ ప్రమాదించలేదు. అతను వర్తకంలో రెండు సంవత్సరాలనుంచీ మంచి లాభం సంపాదిస్తున్నాడు. అడవి మనుష్యులు అతనంటే భారీయైన వూహలు కలవాడనీ మంచి వ్యాపారం పలుకుబడీ కలవాడని తెలుసుకున్నారు. అతని బేరంమీద మరెందరు పోటీచేసినా అగలేక పోవడానికి అతని పలుకుబడే ముఖ్యకారణమని అందరి నమ్మకమును.

సాయంత్రం నాలుగుగంటలు దాటింది.

రమణరావు వూరుదాటి చాలాదూరం నడిచేడు. ఆ వేళ ఏమీతోచక పోయినట్టే కొంచం త్వరగా షికారు బయలుదేరేడు. అయినప్పటికీ ఇంకా అతనికి ఏమీ తృప్తిలేకపోయింది. చాలా టైముంది కదా? అని అగకుండా ప్రక్కదారిని అడవిలోకి బయలుదేరేడు.

ఎదురుగా ఇరవైగజాల దూరంలో ఒక పెద్ద కొలను అతనికి పిల్లగాలులతో ఆహ్వానం పంపింది. సంధ్యాకాంతులలో మిలమిలా తళతళా మని మెరుస్తూవున్న ఆ చల్లని తావు అతనిలో ఎన్నడూ లేని సంతోషం పురికొల్పింది. ఆ వొడ్డుకి వెళ్ళేడు. సరదాగా నీటిలో దిగేడు బట్ట తడుస్తుందనిదాకా. దోసిట నీరుతీసి తాగేడు ఎంతో తృప్తి అతని కళ్ళలో తాండవించింది.

మళ్ళా వొడ్డుకి వచ్చి చతికిల బడదామని వంగుతూ వుండగానే చాలా దగ్గరగా చక్కని పాట వినబడింది. దిగ్గుని నిలబడ్డాడు జాగ్రత్తగా విన్నాడు. ఆ మనోహర సంగీతం అతనిచుట్టూ వినబడ్డట్టు తోచింది. కొలనులో లేచే చిన్న చిన్న కెరటాల వొరుపుతో ఆపాట కిలకిలా సాగుతూవుంటే అతను ప్రపంచం అంతా మరిచిపోయేడు. గాలిలో వాసనలాగ ఆగీతా మాధుర్యం మధురంగా అతని చెవుల్లో అమృతం చిలికింది.

ఆ సంగీతం జాలువారే దిక్కుగా అతని కాళ్లు తమంత తామే నడిచిపోయినై; అతని కళ్లు ఆసుస్వరం ప్రభవించే స్థానం వెతుక్కున్నై.

అతనికళ్ల ఎదుట ఒక మనోహర దృశ్యం.

నున్నని నల్లరాయిపై పదహారేళ్లు నిండని పడుచు పిల్ల కూర్చునివుంది. సంస్కారణం ఎరగని ఆమె శిరోజాలు నల్లగా గుత్తులుగా గుత్తులుగా ఆమె నున్నని బుజాల మీద నుండి దిగువకి జారుతున్నాయి; ఆమె కళ్లు అర్థ నిమీలితాలై మనసులోని ఉద్వేగం బయలు పెడుతున్నాయి; అనాచ్ఛాదితమైన ఆమె శరీరం నిగనిగ మంటున్నది. నున్నని వంపులు తేరిన వక్షం పరిపూర్ణత్వం చాటుతూంది. ఆమె మొలని చిన్న అడవిగడ్డ చుట్టబడివుంది. ప్రకృతిలో పుట్టి ప్రకృతిలో పెరిగి ప్రకృతిలో లీనమైపోయిన ఆ అమాయిక బాలిక అడవి కంతకీ రాణిలా మెరిసి పోతూంది.



ఆమెవేపు చూస్తూ పదిగజాల దూరంలో సిగ్గుతో ఆగిపోయేడు రమణరావు.

ఆమె అతనివేపు చూడలేదు.

ఆమె పాడుతూన్న పల్లెపదం కోయభాషలో వుంది. రమణరావుకి కొంచెం కొంచెం అర్థం అవుతూంది. భావము వ్యక్తీకరించే ఆమె గొంతు వీణమీటులని అనుకరిస్తూ, కరిగిపోతూన్నట్టు తోచింది. అతను ముగ్ధుడై పోయాడు.

ఆమె దగ్గరకు వెళ్లాడు.

అతనివైపు ఆమె చూచింది. ఏమీ తోచలేదు.

అతడు నామెవైపు చూస్తూ నిల్చిపోయాడు.

పది నిమిషాలు గతించాయి.

"నా వైపు ఎందుకలా చూస్తావు" అని ఆమె ప్రశ్నించింది కోయభాషలోనే.

"నువ్వు అందంగా ఉన్నావని" అతను కొంచెం తడబడ్డాడు జవాబియ్యడానికి.

"నువ్వు మాత్రం అందంగా లేవూ? అవేవో ఒంటి నిండా మట్టి బెట్టుకున్నావు. ఏదీ చూడని."

అతను మెల్లగా ఆమె దగ్గరకు వెళ్లి కూర్చున్నాడు. అతను కట్టుకున్న పట్టంచుపంచ ఆశ్చర్యంతో ఆమె తాకింది అతనివైపు చూచి కిలకిల నవ్వింది.

"ఏం బాగలేదూ."

"బాగుంది. ఏం చక్కా వుంటుంది అలాంటివి కట్టుకుంటే గాలిమాత్రం తగలదు......మారెడ్డిగారు కూతురు కూడా ఇలాంటివే కట్టుకుంటుంది. వాళ్ళకి డబ్బు లావుగా వుంది కదూ అందుచేత."

"నీకు కట్టుకోవాలనుందా?"

అతనివైపు ఆమె అదోలా చూచింది.

తన వొళ్లు ఆమెకు తగిలేటంత దగ్గరగా జరిగే డతను. అతని భుజంమీద వున్న వుప్పాడ జరీ కండువా వైపు ఆమె దృష్టి తిరిగింది.

"ఇదంతా బంగారమేనా?" అంది.

"కాదు. వెండి."

"ఛీ! నాకు తెలియదు. బంగారంకాని ఇంత పచ్చగా ఏమీ వుండదు. వెండైతే తెల్లగా అసహ్యం."

అతని హృదయం దడదడా కొట్టుకుంది ఆమెకి అంత దగ్గరగా వున్నందుకు.

ఆమె ఏమీకూడా అయిష్టం కనపర్చలేదు, అతను అంత దగ్గరగా వున్నాడని.

కుడి చెయ్యి మెల్లగా ఎత్తి ఆమె బుజంమీద వేశాడు. ఆ నున్నదనం అతని వొంట్లో రక్తాన్ని వుడికించి పారవేసింది. అప్రయత్నంగా అతననుకోకుండానే ఆమె నడ్డిమీద అతని చెయ్యి జరగడం మొదలు పెట్టింది.

"నన్నెందుకూ అలా తాకుతావు."

అతను గప్పుని సర్దుకున్నాడు చెయ్యి.

"నాకు మొన్ననో పులిపిల్ల కనబడితే పట్టుకున్నాను. దాని వొళ్ళు తాకుతూవుంటే ఇప్పుడు నీకు మల్లే సంతోషంగా వుండేది నాకు."

"నీకు కండువా ఇస్తాను కట్టుకోకూడదా" అన్నాడు రమణరావు ఏమీ తోచక.

"నవ్వరూ నలుగురూను."

ఏం మాట్లాడాలో అతనికి తెలియలేదు. కండువాతీసి ఆమె మెడమీద వేసి పైటలాగ తీశాడు.

ఆమె కిలకిల నవ్వింది.

"చెంచుభామ వేషంలాగా వున్నాను" అంటూ తీసి అతనిమీద విసిరేసింది కండువా.

"మీ ఇల్లెక్కడ?"

"అదగో అల్లా చెట్టుపక్కని వుండే...ఏం...అదే."

క్షణ క్షణం అతనిలోవున్న వుద్రేకం ఎక్కువ కావడం మొదలెట్టింది. ధైర్యంగా ఆమె బుజంమీద చెయ్యి వేసేడు మళ్లా, తనకి దగ్గరగా లాగేడు. అతని కళ్లల్లోకి చూచి ఆమె వూరుకుంది.

పది నిముషాలు దాటేక సంధ్యా కాంతులు పశ్చిమ దిగంతాల్లో పవడాల రంగుతో వెలిగి పోతున్నాయి.

అతని హృదయం అతని అధీనం తప్పింది. రెండు చేతులా ఆమెని కౌగలించుకుని దగ్గరగా అతను అనుముకున్నాడు, బలంగా అతన్ని వదిలించీసుకుని ఆమె రెండడుగులు దూరం జరిగిపోయి కూర్చుంది.

రమణరావుకి ముచ్చెమటలు పోసినై.

ఆమె కళ్లు ఏకాగ్రంగా వొకే ప్రక్కకి చూస్తున్నాయి. అతను మళ్లా ఆమె దగ్గరకి వచ్చేడు.

"నువ్వెందుకు ఇక్కడవుండి పోయేవు. చీకటి పడిపోతూందికదా?" అంది ఆమె.

"........................"

"నీకు భయం వెయ్యదూ?"

"నీకు వెయ్యదూ?" అన్నాడతను మొండిగా.

"నా భర్తవచ్చే వేళయింది, నాకేం భయం."